మన మీ..
వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం

TGBIL/25/A0512

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం
03 నవంబర్ 2026

పేజీలు : 6

@mvaartanews

www.mivaartanews.com

మిల్లింగ్ మాయాజాలం.ముడుపుల ఆరోపణల కలకలం!

- ఐదు మండలాల్లో సీఎంఆర్ అక్రమాలపై అనుమానాలు!

- రేషన్ బియ్యం దళారుల చేతుల్లోకి.రీసైక్లింగ్ చేసి తిరిగి సరఫరా?


- బియ్యం ధరల పెరుగుదలపై ప్రజాగ్రహం. విజిలెన్స్ విచారణకు డిమాండ్.

సత్తుపల్లి నవంబర్ 02 మీ వార్త అర్ సి:

సత్తుపల్లి నియోజకవర్గం పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోందా? ప్రభుత్వ ధాన్యం మిల్లింగ్ వ్యవహారంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయా? కల్లూరు, తల్లాడ, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లోని పలు రైస్ మిల్లుల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం చర్చనీయాంశంగా మారింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంలో కొందరు అధికారులు, మిల్లర్ల మధ్య అనధికారిక అవగాహన ఉందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.

తనిఖీలు చేయకుండానే ధ్రువీకరణలా?

మిల్లుల్లో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ వివరాలు, బియ్యం అప్పగింతలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అయితే తనిఖీలు నిజంగా జరుగుతున్నాయా? లేక కార్యాలయాల నుంచే నివేదికలు, సంతకాలు పూర్తవుతున్నాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



దళారుల చేతుల్లోకి రేషన్ బియ్యం!

పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని దళారులు సేకరించి మిల్లులకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రీసైక్లింగ్ చేసి తిరిగి మార్కెట్‌లోకి లేదా ప్రభుత్వ సరఫరా వ్యవస్థలోకి చేరుస్తున్నారా? అన్న కోణంలో విచారణ జరగాల్సి ఉంది.

ధరల పెరుగుదలతో ప్రజాగ్రహం!

మరోవైపు బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు భారీగా పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మిల్లుల వ్యవహారంలో ముడుపుల ఆరోపణలపైనా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

విజిలెన్స్ విచారణ చేపట్టాలి!

కల్లూరు, తల్లాడ, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లోని రైస్ మిల్లులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, రికార్డుల్లోని నిల్వలు, క్షేత్రస్థాయి నిల్వలను సరిపోల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ధాన్యం సేకరణ నుంచి సీఎంఆర్ అప్పగింత వరకు సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐదు మండలాల్లో జరుగుతున్నాయన్న అక్రమాల. ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు ఎప్పుడు స్పందిస్తారు? విజిలెన్స్ విచారణ ఎప్పుడు మొదలవుతుంది? అన్నదే ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

కొణిజర్ల మండలంలో పలు పరామర్శలకు హాజరైన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్.



ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:

కొణిజర్ల మండలం, తీగలబంజర, మంగాపురం గ్రామాలలో ఇటీవల మరణించిన దొడ్డపనేని లక్ష్మిబాయి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పరామర్శించారు.అలాగే, మోతుకూరి వెంకటేశ్వర రావు మాజీ ఎంపీటీసీ భార్య విజయలక్ష్మి అనారోగ్యంతో మరణించగా, వారి పార్థివ దేహానికి ఆయన నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, నాయకులు తాళ్లూరి జీవన్, పోట్ల శ్రీనివాస రావు, చీకటి రాంబాబు, పోగుల శ్రీనివాస్, పాసంగులపాటి శ్రీనివాస్, అనుమోలు శ్రీనివాస్, దొడ్డపనేని రాము, జెట్ల శ్రీనివాస్, అడపా శంకర్ రావు, వడ్లమూడి సైదా బాబు, అనుమోలు మురళి తదితరులు పాల్గొన్నారు.

తక్కెళ్ళపల్లి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం.

- పార్టీ అధ్యక్షురాలు కవితమ్మ బహుజనుల బాణము కవితమ్మ.

- తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్.

- రాష్ట్ర నాయకులు కిషన్ నాయక్.

ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:



బిఆర్ఎస్ నాయకుడు తక్కెళ్లపల్లి రవీందర్ రావు పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని, ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎస్కే హుస్సేన్ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధ్యక్షురాలు కవితమ్మ బహుజనుల బాణమని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం కవితమ్మ పని చేస్తోందన్నారు. రవీందర్ రావు గురించి అందరికీ తెలుసునని అన్నారు. తప్పుడు పద్ధతుల్లో డబ్బులు సంపాదించారని ఆరోపించారు. ఆయన ఎక్కడ పాదం మోపినా అక్కడ బిఆర్ఎస్ కు నష్టమేనన్నారు. మాట్లాడే ముందు నోరు అదుపులో ఉంచుకోవాలన్నారు. టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, బంజారా విభాగం రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ రవీందర్ రావు మాటలు దొర పలికినట్లుగా ఉన్నాయన్నారు. ఆయన లాగా మాట్లాడడానికి తమకు సంస్కారం అడ్డు వస్తోందన్నారు. బహుజనుల కోసం కవితమ్మ వచ్చిందని, దీనిని ఓర్వలేక పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని అన్నారు. వెంటనే కవితమ్మకు రవీందర్ రావు క్షమాపణలు చెప్పాలన్నారు. ఇకపై నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండింటిలోనూ బీసీ బిడ్డలకే టికెట్ ఇచ్చారన్నారు. పట్టభద్రులు తమ పార్టీని ఆదరించాలన్నారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోరం వీర భద్రరావు, ఎస్టీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ గుగులోత్ రాజ్ కుమార్ నాయక్, పార్టీ జిల్లా నాయకులు వనం నాగేందర్, కార్మిక సంఘం,టిఆర్టియు జిల్లా అధ్యక్షులు జక్కుల ప్రకాశ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గోళ్లపాడులో కాంగ్రెస్‌కు మరింత జోష్.

- బీఆర్ఎస్ నుంచి 30 కుటుంబాల చేరిక.

- మంత్రి పొంగులేటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై హస్తం గూటికి.

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి.

ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలో బీఆర్ఎస్‌కు చెందిన 30 కుటుంబాలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఈ చేరికలు జరిగాయి. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ మంత్రి పొంగులేటి ఇందిరమ్మ ఇళ్ల శీనన్నగా మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్ల ద్వారా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. గోళ్లపాడు గ్రామంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అంతర్గత రహదారుల విస్తరణ, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు మంత్రి పొంగులేటి చొరవతో పూర్తయ్యాయని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఆటో యూనియన్ అధ్యక్షుడు గడ్డమీద ఉపేందర్, మాజీ ఉపసర్పంచ్ దొంతిసర్పు రాంబాబు, మాజీ వార్డు సభ్యుడు చీకటిమళ్ల లక్ష్మీనారాయణ, గౌడ సంఘం నాయకుడు మడికంటి శ్రీను, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు రుద్ర మధు, ఎస్సీ నాయకుడు పొన్నెకంటి రాంబాబు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మండల నాయకులు మద్ది వీరారెడ్డి, మద్ది కిషోర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రుద్ర ఉపేందర్, నాయకులు తేజావత్ పంతులు నాయక్, మద్ది వెంకటరెడ్డి, మందటి వెంకటరెడ్డి, శాబాదు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎచ్ఎం ఉద్యోగుల
న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి.

- జనసేన తెలంగాణా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఖమ్మం నల్గొండ - వరంగల్ జనసేన పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్.గడల శ్రీనివాస్ రావు డిమాండ్.

ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:





తెలంగాణ రాష్ట్రంలో తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత 21 రోజులుగా సుమారు 17,540 మంది ఎన్ఎచ్ఎం ఉద్యోగులు ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర అన్యాయమని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ వద్ద ఎన్ఎచ్ఎం ఉద్యోగులు చేపట్టిన ధర్నాకు ఆయన స్వయంగా హాజరై జనసేన పార్టీ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా గడల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ నిరంతరం ప్రజారోగ్య రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్ఎచ్ఎం ఉద్యోగుల పట్ల ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మహారాష్ట్ర తరహాలోనే తెలంగాణలోనూ ఎన్ఎచ్ఎం ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు.ముఖ్య డిమాండ్లు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించి, 100 శాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలి. ఎన్ఎచ్ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న 8 శాతం లాయల్టీ బోనస్‌ను తక్షణమే విడుదల చేయాలి. జీవో నెం. 1195 ను పునఃపరిశీలించి, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి, ఉద్యోగులందరినీ స్టేట్ హెల్త్ సొసైటీ పరిధిలోనే కొనసాగిస్తూ స్పర్స్ ద్వారా వేతనాలు చెల్లించాలి. ప్రతినెలా 5వ తేదీ లోపు ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేయాలి. మహిళా ఉద్యోగులకు కేడర్‌తో సంబంధం లేకుండా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను వర్తింపజేయాలి. విధి నిర్వహణలో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగి ఉద్యోగి మరణిస్తే, బాధిత కుటుంబానికి 20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి అర్హత ఆధారంగా ఉద్యోగ అవకాశం కల్పించాలి. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, ఎన్ఎచ్ఎం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలని శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే జనసేన పార్టీ ఎన్ఎచ్ఎం ఉద్యోగులకు అండగా నిలిచి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మిరియాల రామకృష్ణ, బండారు రామకృష్ణ, యాసంనేని అజయ్ కృష్ణ, తుడుం ఉత్తం రాజ్, స్రవంతి కన్నా, రమణకుమార్, పూరేటినరేష్, బాణాల శ్రీకాంత్, లయ దేవేంధర్, పుల్లారావు, మణికంఠ, నాగరాజు, లికేష్ ఉమ్మడి ఖమ్మం జిల్లా జన సైనికులు వీర మహిళలు నాయకులు, పాల్గొనడం జరిగింది.

ఖమ్మం కలెక్టరేట్ వద్ద తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాధర్నా.

- ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు.

ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:



ఖమ్మం కలెక్టరేట్ వద్ద తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నా కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు పాల్గొని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు సంఘీభావం తెలిపి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వారి న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు రూ.18,000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం జనసేన పార్టీ ఎల్లప్పుడూ అంగన్వాడీ ఉద్యోగులకు అండగా ఉంటుందని, ఏఐటీయూసీ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మిరియాల రామకృష్ణ, నియోజకవర్గ నాయకులు బండారు రామకృష్ణ, యాసంనేని అజయ్ కృష్ణ, తుడుం ఉత్తం రాజ్, స్రవంతి కన్నా, రమణ కుమార్, పూరేటి నరేష్, బాణాల శ్రీకాంత్, లయ దేవేందర్, పుల్లారావు, మైలవరపు మణికంఠ, నాగరాజుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ నామ.



ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మం నగరానికి చెందిన గొడవర్తి శ్రీనివాసరావు,జయ దంపతుల కుమారుడు అఖిల్ సాయి, చావా శివరామకృష్ణ, విజయ దంపతుల కుమార్తె సిరివెన్నెల వివాహం అక్టోబర్ 28న బెంగళూరులోని అమతరాస నంది హిల్స్‌లో జరిగింది. రఘునాథపాలెంలోని జీఎస్ఎల్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వివాహ రిసెప్షన్ వేడుకకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరయ్యారు. నూతన వధూవరులు అఖిల్ సాయి, సిరివెన్నెలను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ నందు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటానమస్,ఖమ్మం విద్యార్థినులు ప్రతిభ.

- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి.

ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:



సుమన్ షోటోకన్ స్పోర్ట్స్ కరాటే డివో అకాడమీ ఇండియా వారు ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఖమ్మం నందు నిర్వహించిన 32వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ నందు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటానమస్, ఖమ్మం విద్యార్థినులు తమ ప్రతిభను కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.కళాశాలకు చెందిన బీకాం మొదటి సంవత్సరం విద్యార్థినులు కుమారి జి. సాధ్విక రెడ్డి, ఎన్. రమ్య కాటా ఈవెంట్ నందు ప్రథమ బహుమతి పొందారు అని తెలిపారు. ఈ విద్యార్థినులు కళాశాల మహిళా సాధికారిక విభాగం శారీరక వ్యాయామ విద్యా విభాగంవారు సంయుక్తంగా నిర్వహిస్తున్న కరాటే సర్టిఫికెట్ కోర్సులో కరాటే శిక్షకులు రామకృష్ణ, అంజిబాబు వద్ద శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి, మహిళా సాధికారిక విభాగ కన్వీనర్ జి.సావిత్రి, ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, కరాటే శిక్షకులు రామకృష్ణ విద్యార్థినులను అభినందించారు.

సత్తుపల్లి నూతన తహసీల్దార్‌గా పరసా రవి బాధ్యతల స్వీకరణ.

- గతంలో ముదిగొండ మండల తహసీల్దార్‌గా సేవలు.
- సత్తుపల్లిలో కొత్త బాధ్యతలు

సత్తుపల్లి నవంబర్ 02 మీ వార్త ఆర్ సి:



సత్తుపల్లి సత్తుపల్లి మండల నూతన తహసీల్దార్ (ఎమ్మార్వో)గా, పరసా రవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ముదిగొండ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై సత్తుపల్లి మండలానికి వచ్చి నూతన బాధ్యతలు చేపట్టారు.రెవెన్యూ శాఖలో తనకున్న అనుభవంతో సత్తుపల్లి మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ఆయన దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా భూ సమస్యలు, రెవెన్యూ రికార్డులు, ప్రజల వినతుల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సమన్వయంతో ముందుకు సాగాల్సిన బాధ్యత ఆయనపై ఉంది.నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పరసా రవికి పలువురు అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు శుభాకాంక్షలు తెలియజేశారు. సత్తుపల్లి మండల అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఢిల్లీలో నిరసన ప్రదర్శన బీజేపీ ప్రభుత్వంపై సత్తుపల్లి ఎమ్మెల్యే విమర్శలు.

సత్తుపల్లి నవంబర్ 02 మీ వార్త ఆర్ సి:



ఆదివారంఢిల్లీలో జరిగిన నిరసన ప్రదర్శనలో, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్ స్పెషల్ ఇన్వెటేషన్, రివిజన్) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించి, అడ్డదారిలో మళ్లీ అధికారంలోకి రావాలని ప్రధాని నరేంద్రమోదీ,ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.ఈ ప్రయత్నాలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పూర్తి మద్దతు ఇస్తున్నారని ఆమె విమర్శించారు.ఈ చర్య రాజ్యాంగ విరుద్ధమని, చట్టవిరుద్ధమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారం కోసం ఇంతకంటే దారుణమైన ఉదాహరణ మరొకటి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు.భారత ప్రజలు ఇటువంటి పాలన కోసం ఓటు వేయలేదని స్పష్టం చేసిన ఆమె, నైతిక విలువలు, నిజాయితీ, చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వం ఉండాలని దేశం మొత్తం కోరుకుంటోందని నొక్కి చెప్పారు.ప్రజలందరూ కుల, మత, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఏకం కావాలని, ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా గళమెత్తాలని, తద్వారా ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని రాగమయి దయానంద్ పిలుపునిచ్చారు.

ఖమ్మంలో ఘనంగా ఎస్ఎస్ మండి మాల్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం.

- తుమ్మల యుగంధర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం.
- కుటుంబ సభ్యులకు ఆహ్లాదకరమైన అతిథ్యం అందించడమే లక్ష్యం.

ఖమ్మం, నవంబర్ 2,మీ వార్త ప్రతినిధి.

ఖమ్మం నగరంలోని రోటరీ నగర్‌లో, పర్ణశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ మండి మాల్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. రెస్టారెంట్ యజమాని చల్లా శివ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మల యుగంధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రగొర్ల హనుమంతురావు, జిల్లా గ్రంథాలయ కమిటీ



చైర్మన్ ఖాదర్ బాబు, చేతుల మీదుగా రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి ఆధునిక జీవనశైలిలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో భోజనం చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం నగరంలో ఫ్యామిలీ రెస్టారెంట్లకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని ఎస్ఎస్ మండి మాల్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమాని చల్లా శివ నూతన వ్యాపారాన్ని ప్రారంభించడం ద్వారా నగర ప్రజలకు ఆతిథ్య సేవలను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఏదైనా వ్యాపారం విజయవంతం కావాలంటే నాణ్యత, పరిశుభ్రత, వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకమైన సేవలు ఎంతో ముఖ్యమైనవి. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఆహార పదార్థాలను అందిస్తూ, కుటుంబ సభ్యులు సంతోషంగా గడిపే వాతావరణాన్ని కల్పించడం మా ప్రత్యేకత అన్నారు.

తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక కార్యాచరణ.





- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.
- ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు.

ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:

వేసవి కాలం, ఎల్నినో ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, జిల్లాలోని అన్ని నివాస ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్, డబ్ల్యూఎస్ఎమ్ చైర్మన్ దివాకర టి ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరా మౌళిక సదుపాయాలపై, అడిగిన వారికి పని కల్పన పై కలెక్టర్, జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 21 మండలాల్లో నవంబర్ 09 నుండి నవంబర్ 14 వరకు మండల స్థాయి సమావేశాలను నిర్వహించాలన్నారు. ఇట్టి సమావేశాలలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు మరియు సాంకేతిక సిబ్బంది వంద శాతం భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఎఈఈ, ఎఈ, ఎంపీఓ, సర్పంచ్‌లు, కార్యదర్శులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతి వీధిలో 24-పాయింట్ల చెక్‌లిస్ట్ ఆధారంగా క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు ముందే హ్యాండ్ పంపులు, సింగిల్,త్రీ-ఫేజ్ మోటార్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల నివారణ, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల శుభ్రత, క్రిమిసంహారక చర్యలు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో 3 నెలలకు సరిపడా బ్లీచింగ్ పౌడర్ బఫర్ స్టాక్ నిల్వ ఉంచాలని తెలిపారు. తక్కువ వర్షపాతం, నీటిమట్టం పడిపోవడం లేదా స్థానిక బోరుబావులు ఎండిపోయిన ప్రాంతాలను గుర్తించి, నీటి ఎద్దడి రాకుండా గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన చోట నిబంధనల ప్రకారం ప్రైవేట్ వ్యవసాయ బావులను అద్దెకు తీసుకోవడానికి ముందస్తు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీటి శుద్ధి కేంద్రాలు, ఇంటేక్ బావులు, పంపింగ్ స్టేషన్లను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, కనీస నీటి మట్టాలను నిర్వహించాలని తెలిపారు. అలాగే అన్ని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో 3 నెలలకు సరిపడా ఆలమ్,పిఏసి, క్లోరిన్ నిల్వలు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి టోల్-ఫ్రీ నంబర్ 1916 పై ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నోటీసు బోర్డులు, డప్పు చాటింపులు, స్థానిక వార్డు గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. రోజువారీ నివేదికలను సేకరిస్తూ, వారపు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి కలగకుండా చూడాలని కలెక్టర్ హెచ్చరించారు. ఎల్నినో దృష్ట్యా అడిగిన వారికి పనిదినాలు కల్పించాలని కలెక్టర్ అన్నారు. అన్ని గ్రామపంచాయతీల్లో పనులు గుర్తించి, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ రెండో విడత ఇండ్ల మంజూరు ప్రక్రియను పూర్తి చేసి, నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ శేఖర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్, ఎంపీడీవో లు, ఎంపీవోలు, మిషన్ భగీరథ ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి డాక్టర్ గీత, వైద్యాధికారి.

నేలకొండపల్లి నవంబర్ 02 మీ వార్త ఆర్ సి:

నేలకొండపల్లి పొగాకు రహిత సమాజ నిర్మాణం కోసం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి మండల అభివృద్ధి అధికారి శ్రీ ఎర్రయ్య అధ్యక్షతన అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధులబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గీత మాట్లాడుతూ, పొగాకు వినియోగం నేటి సమాజాన్ని, ముఖ్యంగా యువత భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తోందని తెలిపారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ, పాన్‌మసాలా వంటి పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడటం వల్ల నోటి క్యాన్సర్‌తో పాటు వివిధ రకాల క్యాన్సర్లు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ దురలవాట్లు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీయడమే కాకుండా, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఆటంకంగా మారుతున్నాయని పేర్కొన్నారు. భారతదేశంలో యువత





జనాభా అధికంగా ఉన్న నేపథ్యంలో, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం అత్యంత అవసరమని ఆమె అన్నారు. యువత పొగాకు వ్యసనాలకు బానిసలైతే వారి వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ, రాష్ట్ర, దేశ అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. పొగాకు వినియోగాన్ని అరికట్టి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు విద్యావంతులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, బాధ్యతగల పౌరులు సమిష్టిగా కృషి చేయాలని డాక్టర్ గీత పిలుపునిచ్చారు. అనంతరం శిబిరానికి హాజరైన వారందరితో పొగాకు రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీ రాంప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల మండల అధికారులు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కరువు నుండి పేదలను కాపాడాలి.

- చౌకదుకాణం లో మనిషికి 12 కిలోల బియ్యం, 14 రకాల సరుకులు ఇవ్వాలి.
- వ్యకాస నేత కొండబోయిన నాగేశ్వరరావు.



కారేపల్లి నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి: ఎల్‌నినో కరువు ప్రభావం, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పేదలు జీవితాలు ఇబ్బందులలో పడ్డాయని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కారేపల్లి లో విలేకరులతో మాట్లాడుతూ కరువు ప్రభావాన్ని ఆసరా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బియ్యం, నిత్యావసర సరుకుల ధరలను పెంచేస్తున్నారన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించాల్సిన ప్రభుత్వానికి సంబంధం లేనట్టుగా చూస్తుందని విమర్శించారు. బ్లాక్ మార్కెట్ దారులపై ప్రభుత్వంనియంత్రణ కొల్పోయినట్లుగా ఉందన్నారు. ప్రతి దుకాణాల్లో సరుకుల ధరల పట్టిక ఏర్పాటు చేసేలా చూడాలని, ధరల నియంత్రణకు ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా ప్రతి మనిషికి నెలకు 12 కిలోల బియ్యం తో పాటు మంచి నూనె, కందిపప్పు, గోధుమలు. జొన్నలు. పంచదార. టీపొడి, ఉప్పు, కారం, పసుపు, చింతపండు లాంటిది 14 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని ఆయన కోరారు. కరువు ప్రభావంతో కూలీలకు పనులు లేవని, ఈ సమయంలో ఉపాధీ హామీ పనిని ప్రతి కుటుంబానికి 200 రోజులు కల్పించి, కొలతలతో సంబంధం లేకుండా రోజువారీ కూలీని రూ.800 చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటల వేయక, వేసిన పంటల పండక రైతులు మానోధైర్యం కోల్పోతున్నారని వారిని ఆదుకోవటానికి పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇచ్చి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. కరువు నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలను ఆదుకోవాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయడంతో పాటు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కొండబోయిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది.

- రైతులు, విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం.

- బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకట వీరయ్య.

సత్తుపల్లి నవంబర్ 02 మీ వార్త టౌన్ రిపోర్టర్:

సత్తుపల్లి ఖమ్మం జిల్లా సత్తుపల్లి లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సత్తుపల్లి, పెనుబల్లి మండలాలకు చెందిన ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకట వీరయ్య నాయకులకు ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంద్ర వెంకట వీరయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోందని అన్నారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తూ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్ రావును అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని, 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడటం కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. మియాపూర్ భూముల వ్యవహారంపై మాట్లాడుతూ.. 2017లో మియాపూర్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి సర్వే నంబర్లు 100, 101లో రిజిస్ట్రేషన్లను నిలిపివేయించారని గుర్తుచేశారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించడంతో పాటు సీఐడీ విచారణకు ఆదేశించి, పోలీసు కేసులు నమోదు చేయించారని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలోని కొందరు అధికారుల పాత్ర బయటపడటంతో వారిపై కూడా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. 1997, 2003లో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ఆధారంగా చేసుకుని ఆ భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం భూ కబ్జాదారుల చెరలో ఉన్న విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు కేసీఆర్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లారని తెలిపారు. ఇందులో భాగంగా 2015లో



సుప్రీంకోర్టులో తెలంగాణ తరఫున వాదించేందుకు ప్రముఖ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్‌ను ప్రత్యేక న్యాయవాదిగా నియమించారని గుర్తుచేశారు. 2015 ఏప్రిల్ 7 నుంచి 2023 వరకు ఎనిమిదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం మియాపూర్ భూముల వ్యవహారంలో న్యాయపోరాటం కొనసాగించిందని, సమగ్ర నివేదికలు, అఫిడవిట్లు, కీలక పత్రాలను సుప్రీంకోర్టుకు సమర్పించిందని వివరించారు. 2023 జూన్ 15న ట్రినిటీ ఇన్‌ఫ్రా వెంచర్స్, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు సంబంధించిన భూముల కేసులో బీఆర్ఎస్ ప్రభుత్వం విజయం సాధించిందని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లోనూ ఈ విషయం స్పష్టంగా ఉందని అన్నారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుదీర్ఘ న్యాయపోరాటానికి కొనసాగింపుగానే ప్రస్తుత తుది తీర్పు వచ్చిందని, అయితే మొత్తం ఘనత తన ప్రభుత్వ కృషి వల్లే సాధ్యమైందన్నట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు.

రైతుల సమస్యలపై స్పందిస్తూ.. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో పంటలు సరిగా పండక రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు అకాల వర్షాలతో చేతికొచ్చిన కొద్దిపాటి పంట కూడా నీటిపాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో 28 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క స్థానంలో మాత్రమే విజయం సాధించిందని, ఇది ఆ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ వ్యతిరేకత బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులకు దిశానిర్దేశం చేస్తూ.. 2026 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని సూచించారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో పాటు రెండో ప్రాధాన్యత ఓటు కూడా అత్యంత కీలకమని, ప్రతి ఓటును సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పట్టభద్రులను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదు చేయించాలని, గ్రామాల వారీగా గ్రామ పంచాయతీ కార్యాలయాల (జి పి ఓ) వద్ద అర్హుల జాబితాలను సేకరించి నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో మిగిలిన నాలుగు రోజులు నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా సత్తుపల్లి, పెనుబల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటు నమోదు చేయించి పార్టీ విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకట వీరయ్య కోరారు. ఈ కార్యక్రమంలో కూసంపూడి రామారావు, బొడ్డు శివ బాబు, మండలపు ప్రభాకర్, చక్కిలాల లక్ష్మణ్ రావు, చక్కిలాల మోహన్ రావు, భాను, కోటగిరి సుధాకర్ బాబు, మండలపు అశోక్, టీవీ రామారావు, చింతల సురేందర్ రెడ్డి తదితరులున్నారు.

ఈద్గా స్థలాన్ని వక్ఫ్ బోర్డులో నమోదు చేయాలి.

- ఆక్రమణలకు గురికాకుండా భూమికి హద్దులు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలి.

- ముస్లిం మైనారిటీ రక్షణ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఎస్.కె. జహురుద్దీన్ భాష.

చర్ల నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:

చర్ల మండల కేంద్రంలోని ఈద్గా స్థలాన్ని తక్షణమే వక్ఫ్ బోర్డులో నమోదు చేసి, భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ముస్లిం మైనారిటీ రక్షణ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఎస్.కె. జహురుద్దీన్ భాష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చర్ల మండల కేంద్రంలోని జమా మసీదులో ముస్లిం పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చర్ల ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న సుమారు మూడు ఎకరాల భూమిని గతంలో ఈద్గా అవసరాల కోసం కేటాయించారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ముస్లిం సమాజం ఈ స్థలంలో పండుగలు, ప్రార్థనా



కార్యక్రమాలు నిర్వహించుకుంటోందని పేర్కొన్నారు. ముస్లిం సమాజానికి భవిష్యత్తులో ఉపయోగపడే విధంగా ఈ స్థలంలో షాదీఖానా, మదర్సా, కబరస్థాన్ తదితర అవసరాల కోసం వినియోగించాలనే ఆలోచన ఉందన్నారు. అయితే విలువైన ఈ భూమి క్రమంగా ఆక్రమణలకు గురవుతుండటం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలాన్ని వక్ఫ్ బోర్డులో నమోదు చేయించాలని ముస్లిం పెద్దలు గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, తహసీల్దార్ తదితర అధికారులను కలిసి వినతులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని అన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, నిబంధనల ప్రకారం వక్ఫ్ బోర్డులో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అలాగే భూమి హద్దులను అధికారికంగా గుర్తించి, ఆక్రమణలకు తావులేకుండా రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మత పెద్దలు ఎస్.కే. షాజహాన్, సలీం, అజీజ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి లో ఘనంగా సమాధుల ఆశీర్వాద పండుగ.

- ఆత్మల రక్షణకై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన క్రైస్తవ సోదరులు.

- తల్లిదండ్రులను ప్రతి ఒక్కరు గౌరవించాలి.

- సత్ ప్రవర్తనతో మెలగాలి.

- ఆర్ సి ఎం చర్చి ఫాదర్ జి.ప్రవీణ్ కుమార్.

- తల్లిదండ్రులు చిలుముల బిక్షం - మంగమ్మ జ్ఞాపకార్థం పేదలకు పండ్లు పంపిణీ చేసిన కుమారులు

కామేపల్లి నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:

కామేపల్లి లో సమాధుల ఆశీర్వాద పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు.కారేపల్లి ఆర్.సి.యం చర్చి విచారణ గురువులు ఫాదర్ జి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఉపదేశకులు శీలపాక వీరభద్రం సారధ్యంలో క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా సమాధుల ఆశీర్వాద పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు చిలుముల బిక్షం మంగమ్మ సమాధి వద్ద వారి కుమారులు చినుముల శ్రీనివాస్, సర్వయ్య, రమేష్, వారి కుటుంబ సభ్యులు ఫాదర్ ప్రవీణ్ కుమార్ తో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ సమాధిని ఆశీర్వదించి వారి ఆత్మల రక్షణకై ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలని కోరారు. సత్ప్రవర్తన కలిగి వారి పట్ల మర్యాదగా నడుచుకోవాల ని కోరారు. సమాధుల ఆశీర్వాద పండుగ విశిష్టతను వివరించి క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. అనంతరం చినుముల శ్రీనివాస్, సర్వయ్య, రమేష్ తమ తల్లిదండ్రులు బిక్షం - మంగమ్మ జ్ఞాపకార్థం పేదలు, దివ్యాంగులు, ఆటో డ్రైవర్లకు పండ్లు పంపిణీ చేశారు.





ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు చిప్పలపల్లి పుల్లయ్య, దోమల బాలశౌరి, కొర్ర పీక్ల, అజ్మీర రమేష్, అమిరిబోయిన తిరుపతయ్య, గంట సంపత్ కుమార్, పెంటయ్య, రమేష్, అభిరామ్, దివ్యాంగుల సంక్షేమ సంఘం నేత పెరుగు సైదులు, యన్నమాల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఫాదర్ ప్రవీణ్ కుమార్ అన్ని సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. మృతుల ఆత్మ రక్షణకై ప్రార్థించి ఆశీర్వదించారు. చినుముల లక్ష్మి, క్రైస్తవ సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీసీలు అంటే ఓట్ల సమూహం కాదు. ఈ దేశానికి వెన్నెముక.

- నూనె హరిబాబు యాదవ్ బీసీ జేఏసీ.

సత్తుపల్లి నవంబర్ 02 మీ వార్త ఆర్ సి:



దేశ అభివృద్ధిలో బీసీలది చెరగని ముద్ర అని వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు, చేతివృత్తుల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ వరకు ప్రతి రంగంలో బీసీల శ్రమ ఉంది. కానీ అధికారం, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం విషయానికి వచ్చేసరికి బీసీలకున్యాయం ఎందుకు జరగడం లేదు అని ఖమ్మం లో జరిగిన బీసీల ఆత్మ గౌరవ వేదిక గా, బీసీ జేఏసీ కో కన్వీనర్ నూనె హరిబాబు యాదవ్ ప్రశ్నించ్చారు. జనాభాలో వాటా ఉన్నప్పుడు అధికారంలోనూ వాటా ఉండాలి. కష్టాల్లో భాగస్వామ్యం ఉన్నప్పుడు పాలనలోనూ భాగస్వామ్యం ఉండాలి.

బీసీలకు కావాల్సింది ఎవరో వేసే దయాదాక్షిణ్యాలు కాదు... రాజ్యాంగబద్ధమైన హక్కులు, సమాన అవకాశాలు, తగిన రాజకీయ ప్రాతినిధ్యం. ఇక బీసీలను కేవలం ఎన్నికల సమయంలో గుర్తు చేసుకునే రాజకీయాలకు కాలం చెల్లాలి. బీసీల ఐక్యతను, ఆత్మగౌరవాన్ని, హక్కులను తక్కువ అంచనా వేసే రోజులు పోవాలి. మా నినాదం ఒక్కటే..విద్యలో న్యాయం కావాలి! ఉద్యోగాల్లో న్యాయం కావాలి! రాజకీయాల్లో తగిన వాటా కావాలి! అభివృద్ధిలో సమాన భాగస్వామ్యం కావాలి! బీసీల ఐక్యతే బలం.బీసీల ఆత్మగౌరవమే లక్ష్యం... బీసీల

హక్కుల సాధనే మన గమ్యం.. ఇది ఒక ప్రాంతానికి సంబంధించిన పోరాటం కాదు.దేశవ్యాప్తంగా బీసీల న్యాయమైన హక్కుల కోసం సాగాల్సిన ఉద్యమం!

అధికారులు మా రహదారి మార్గాన్ని బాగు చేయరా?

- లింకు రహదారికి మోక్షం లేదా!



కారేపల్లి నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి: గ్రామాల మధ్య లింకు రహదారులు అధ్వానంగా మారిన ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో నేడు ఒకటిన్నర కిలోమీటర్ల రహదారి మార్గం గుంటలమయమై వాహనదారులు రైతులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనం ఇది మా రహదారి మార్గాన్ని బాగు చేయరా అని బాధిత గ్రామాల ప్రజలు తమ గోడు పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్న తీరు ఇది! దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి సింగరేణి మండలం గుట్ట కింద గుంపు గ్రామపంచాయతీ పరిధిలో గల గాజుల తండా గ్రామం నుండి ఉసిరికాయలపల్లి సీతారాంపురం బీటీ రహదారి మార్గం వరకు ఒకటిన్నర కిలోమీటర్ల మట్టి లింకు రహదారి మార్గం కలదు ప్రతినిత్యం ఈ రహదారి మార్గం ద్వారా రైతులు తమ పొలాలకు వెళ్లడంతోపాటు ఏజెన్సీ గ్రామాలకు వెళ్లేందుకు తక్కువ సమయం తీసుకుంటుంది అయితే ఈ రహదారి మార్గానికి ఎలాంటి మరమ్మత్తులు చేయకపోవడంతో ప్రస్తుతం లోతైన గుంటలు పడి ప్రయాణించడానికి వీలు లేకుండా ఉంది ఈ మార్గంలో రహదారి చుట్టూ తుమ్మ చెట్లు కొమ్మలు అల్లుకొని ప్రమాదకరంగా మారింది ఈ మార్గంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం లేదు పలుమార్లు ఈ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేలు ఎంపీలకు వినతి పత్రాలు అందజేసిన ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని స్థానికులు వాపోతున్నారు ఇప్పటికైనా అధికారులు మా రహదారి మార్గాన్ని బీటీ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు భద్రతే లక్ష్యంగా చెట్ల కొమ్మల తొలగింపు.

- సర్పంచ్ పోలెబోయిన సుజాత ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది చర్యలు.



కరకగూడెం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి: కరకగూడెం గ్రామపంచాయతీ పరిధిలో రహదారులకు ఇరువైపులా పెరిగి వాహనాల రాకపోకలకు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన చెట్ల కొమ్మలను గ్రామ సర్పంచ్ పోలెబోయిన సుజాత ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది తొలగించారు. రహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు, చెట్ల కొమ్మల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలను నివారించేందుకు ఈ చర్యలు చేపట్టారు. గ్రామంలో ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ నిరంతరం చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా సర్పంచ్ పోలెబోయిన సుజాత తెలిపారు. గ్రామ ప్రజల భద్రత, సౌకర్యాలే ప్రాధాన్యంగా తీసుకొని అవసరమైన చోట పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను నిరంతరం చేపడతామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, చిట్టి పెద్ద వెంకన్న, వీర నరసింహారావు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిటీ మధ్యలో రియల్ జోరు

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తోంది. అయితే ఒకప్పుడు రియల్ ఎస్టేట్‌కు కేంద్ర బిందువైన సెంట్రల్ హైదరాబాద్ ఇప్పుడు మళ్లీ జోరు కనబరుస్తోంది. పూర్వ వైభం దిశగా వడి వడిగా అడుగులు వేస్తోంది. పాత ఇళ్ల స్థానంలో కొత్త ఆకాశ హర్మ్యాలు వెలుస్తున్నాయి. ఆకాశాన్ని తాకేలా భవనాలతో అందరి చూపుని ఆకర్షిస్తోంది.దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ముందు వరుసలో ఉంటుంది. నగరం నలుమూలల విస్తరిస్తూ మల్టీనేషనల్ కంపెనీలను ఆకర్షిస్తోంది. అయితే, ఒకప్పుడు వ్యాపార, వాణిజ్య, నివాస, ఉపాధి కేంద్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న సెంట్రల్ హైదరాబాద్ ఇప్పుడు మళ్లీ ఫోకస్‌లోకి వచ్చింది. మళ్లీ పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తోంది. బషీర్‌బాగ్, సైఫాబాద్ వంటి ప్రాంతాల్లో ఆకాశ హర్మ్యాలు వెలిశాయి. ఎత్తయిన రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ భవనాలు నిర్మితమవుతున్నాయి. బేగంపేట విమానాశ్రయం తరలింపు, ట్రాఫిక్ సమస్యల వంటి వివిధ కారణాలతో ఈ ప్రాంతం శోభ తగ్గినా.. ప్రస్తుతం పాత భవనాల పునర్నిర్మాణం, పరిశ్రమల భూముల వినియోగంలో మార్పుల ద్వారా సరికొత్త రియల్ ఎస్టేట్ రంగును సంతరించుకుంటోంది.

నేడు జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ

మంత్రి పొంగులేటి పర్యటన.

ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. తొలుత ఉదయం 11 గంటలకు కూసుమంచి మండలం గంగబండ తండా వద్ద కొనసాగుతున్న వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తారు. తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి లో గల చావిడి సెంటర్ ప్రాంతంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మధ్యాహ్నం 12:30 గంటలకు తిరుమలాయపాలెం మండలం గోపాలపురంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం 2:30 గంటలకు దమ్మాయిగూడెంలో తిరుమలాయపాలెం మండల లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం ఏలువారిగూడెం లో బీటీ రోడ్డు నిర్మాణానికి, మధ్యాహ్నం 3 గంటలకు బీరోలు గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంక్ ఓ హెచ్ ఎస్ ఆర్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా సమాధుల పండుగ.



ఇల్లందు నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి: ఈ లోకం విడిచి పరలోకానికి వెళ్లిన తమ కుటుంబ సభ్యులు, బంధువులను సమాధుల పండుగ రోజున కీర్తించటం క్రైస్తవుల ఆనవాయితీ. పిల్ల పాపలతో సమాధులను అలంకరించి కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేయటం ఈరోజు ప్రత్యేకత. సోమవారం సాయంత్రం పట్టణంలోని బందెల మల్లయ్య కుంట ప్రాంతంలో గల సమాధుల వద్ద సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు సమాధులను విద్యుత్ దీపాలు కొవ్వొత్తులతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాధుల పండగ సందర్భంగా స్మశాన వాటిక విద్యుత్ దీపాలు వెలుగులు వీరజిమ్మింది. క్రైస్తవ సోదరులు నిర్వహించిన సమాధుల పండగ ప్రత్యేక ప్రార్థనలకు పలువురు పట్టణ ప్రముఖులు హాజరై పరలోకానికి వెళ్లిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన చేశారు. సమాధులను వివిధ రకాల పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి తీర్చిదిద్దారు. సిఎస్ఐ చర్చి ఫాస్టేట్ చైర్మన్ రెవరెండ్ దైవ ప్రతాప్ మరియు బి. రాజేంద్ర బాబు అయ్యగార్లు మరియు చర్చి కమిటీ సభ్యుల ఆధ్వర్యం లో ఈ పండుగ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చర్చి సంఘ పెద్దలు, స్త్రీలు, సంఘస్తులు యువకులు పిల్లలు అనేక మంది ఈ ప్రార్థనలో పాల్గొన్నారు.

కొమ్మినేపల్లి మత్స్య సహకార సంఘం అధ్యక్షులుగా భూక్య నాగేంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నిక.





కామేపల్లి నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి: కామేపల్లి మండలం లో అతిపెద్ద కొమ్మినేపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షులుగా భూక్యా నాగేంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.సోమవారం కొండాయిగూడెం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారి కే.కిషోర్ బాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బండి నాగేశ్వరరావు, కార్యదర్శిగా అయితనబోయిన విఠల్ రావు ఎన్నిక కాగా కమిటీ డైరెక్టర్లుగా చల్లా మల్లయ్య, మేకల కృష్ణ,బేతి వెంకటేశ్వర్లు, ధరావత్ రవి, భానోత్ గోపీచంద్,మొగిలి శ్రీను లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నాగేంద్రబాబు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.నిరంతరం సభ్యుల సమస్యలు పరిష్కరిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండాయి గూడెం సొసైటీ చైర్మన్ డి. హనుమంతరావు, కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, గ్రామ పెద్దలు, సొసైటీ బాధ్యులు పాటిబండ్ల ప్రసాద్, దరావత్ హరిచంద్ర, బాదావత్ నాగరాజు, జి కిషన్, ధరావత్ విన్ని బాబు, తేజవత్ శంకర్, వీర నాగులు, రవి, కొమ్మినేని శ్రీనివాసరావు, బండి ఉపేందర్, హుస్సేన్, డి. రాము, చొప్ప రమేష్, పండగ నాగేశ్వరరావు, వెంకన్న, డి.ఉపేందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ పోర్స మెంట్ దాడుల్లో హోటల్స్.....

హైదరాబాద్ : భాగ్యనగరంలో బిర్యానీ, చాయ్, రుచికరమైన వంటకాల కోసం నిత్యం వేలాది మంది క్యూ కట్టే ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్ల అసలు బండారం ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడుల్లో బట్టబయలైంది. టీజీ సేఫ్ విభాగం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 22 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు గోల్కొండ, చార్మినార్ జోన్లలో ఏకకాలంలో భారీ తనిఖీలు చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో నగరంలో అత్యంత పేరుగాంచిన షాగౌస్, హోటల్ నయాబ్, మెహఫిల్, సొహైల్ వంటి రెస్టారెంట్ల వంటగదుల్లో కనిపించిన దృశ్యాలు అధికారులనే నివ్వెరపరిచాయి.ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి తీవ్రమైన అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన మొత్తం 14 ప్రముఖ రెస్టారెంట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను అధికారులు తక్షణమే సస్పెండ్ చేస్తూ, వాటి కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల సందర్భంగా ప్రముఖ హోటళ్ల వంటగదుల్లో వెలుగుచూసిన పరిస్థితులు భయానకంగా ఉన్నాయి. కుళ్ళిపోయిన కూరగాయలు, ఫంగస్ పట్టిన ఆహార పదార్థాలు, ఎక్స్‌పైరీ అయిపోయిన సరుకులను యథేచ్ఛగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పచ్చి మాంసాన్ని, శాకాహార వంటకాలను నిబంధనలకు విరుద్ధంగా ఒకేచోట నిల్వ ఉంచడం, ఒకసారి వాడిన నూనెనే మళ్లీ మళ్లీ మరిగిస్తూ వంటలు చేస్తుండటం బయటపడింది.

మణుగూరులో సెయింట్. జాన్ దేవాలయం
ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆల్ సోల్స్ డే వేడుకలు.







- మృతుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసిన -- రెవ. జి సురేష్ అయ్యగారు అశోక్ నగర్ పాస్టేట్ చైర్మెన్.
- సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించిన సంఘస్తులు.

మణుగూరు నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:

ఆల్ సోల్స్ డే (సర్వమృతుల సంస్మరణ దినోత్సవం) సందర్భంగా మణుగూరు ప్రాంతంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో మృతులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలు, సమాధుల ప్రాంగణాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తమకు ఆత్మీయులైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను కోల్పోయిన వారు వారి సమాధుల వద్దకు చేరుకుని పూలు సమర్పించి, కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ మరణించిన వారి ఆత్మలకు నిత్యశాంతి కలగాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులు తమ ఆత్మీయులతో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.మరణం అనేది ప్రతి మనిషి జీవితంలో సహజమైనదని, అయితే మన మధ్య లేకపోయినా మన ఆత్మీయుల జ్ఞాపకాలు ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచిపోతాయని పలువురు తెలిపారు. ప్రేమ, అనురాగం, మానవత్వం, విశ్వాసం వంటి విలువలను ఈ రోజు గుర్తుచేస్తుందని పేర్కొన్నారు.ఆల్ సోల్స్ డే సందర్భంగా మణుగూరు ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాస్టేట్ ట్రెసరర్ మేడే సుధీర్, యూత్ సెక్రటరీ చిట్టిమల్ల సునీల్, మరియు కమిటీ వారు, స్త్రీల మైత్రి వారు, యవ్వనస్తుల బృందం, సంఘస్తులు పాల్గొన్నారు.

అందరినీ ఆకట్టుకున్న కొమ్మినేపల్లి హై స్కూల్
గణిత ఉపాధ్యాయుడు గుండమల్ల వెంకటేశ్వర్లు నృత్యం.





- ప్రభుత్వం నుండి ప్రశంసా పత్రం అందజేత.
- వెల్లి విరిసిన హర్షం.
- అభినందించిన ఉపాధ్యాయులు, అధికారులు.

కామేపల్లి నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి:

కామేపల్లి మండలం కొమ్మినేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గుండమల్ల వెంకటేశ్వర్లు ఫోక్ డాన్స్ సోలో నృత్యం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో ప్రభుత్వం వెంకటేశ్వర్లుకు ప్రశంసా పత్రం అందజేసి అభినందించింది. అందుకు సంబంధించిన వివరములు ఇలా ఉన్నాయి. ప్రభుత్వం అక్టోబర్ 28,29, 30 తేదీలలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సహకారంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రెటరీ అసోసియేషన్ అఖిలభారత సివిల్ సర్వీస్ సంగీత నృత్య,నాటక పోటీల ఎంపికలు నిర్వహించింది. ఖమ్మం జిల్లా నుండి కొమ్మినేపల్లి పీఎం శ్రీ పాఠశాల గణిత ఉపాధ్యాయులు గుండమల్ల వెంకటేశ్వర్లు పాల్గొని మన దేశంలో జరుపుకునే సాంప్రదాయ పండుగలు దసరా, దీపావళి సంక్రాంతి, ఉగాది ల చారిత్రి క ని విషయాలను, ఎట్లున్నవే నా పల్లె ఎట్లున్నవే నా తల్లి పాటకి ఫోక్ డాన్స్ సోలో నృత్యం చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. దీంతో ప్రభుత్వం నుండి ప్రశంసా పత్రం 2026 -2027 సంవత్సరానికి అందుకున్నారు. అదే విధంగా యువత లో మార్పు అనే నాటికలో చెడు అలవాట్లు కు దూరంగా ఉండాలని చాటి చెబుతూ యువత పాత్రను పోషించి మేల్కొల్పారు. యువతలో మార్పు తీసుకువచ్చారు. ఉపాధ్యాయుడు గుండమల్ల వెంకటేశ్వర్లు ప్రదర్శించిన నృత్యం, యువతలో మార్పు కోసం నాటిక అందరినీ అలరించటం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. ప్రభుత్వం నుండి అతనికి ప్రశంసా పత్రం అందజేయడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించడం జరిగింది.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి.





- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్.

ఖమ్మం నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి: ప్రజా వినతుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన కే.రవీంద్ర బాబు సర్వే నెంబర్ 230 లో ఉన్న భూమి సర్వే చేసి రికార్డు మార్పు చేయగలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఏదులాపురం పట్టణానికి చెందిన పలువురు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ ప్రోటోకాల్ ఉల్లంఘిస్తూ ఎన్నికైన ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని వీటిని సవరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కూసుమంచి మండలం తురకగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ బుర్ర కృష్ణ తమ గ్రామంలో కొమ్ము ఇందిరమ్మకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించడం జరిగిందని దురదృష్టవశాత్తు కుటుంబ సభ్యులందరూ మరణించినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ ఇంటికి చట్టబద్ధమైన హక్కు దారులు ఎవరైనా ఉన్నారు విషయాన్ని పరిశీలించాలని, చట్టపరమైన హక్కు దారులు ఎవరూ లేకపోతే మరో లబ్ధిదారుల్ని ఎంపిక చేసే పంపిణీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.చింతకాని మండలం వందనం గ్రామం చెందిన ప్రజలు మత్స్య శాఖ సభ్యులు వందనం గ్రామ చెరువుకు సాగర్ ఎడమ కాలు ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించి చెరువులు నింపాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ ఇరిగేషన్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్ఓ సీహెచ్. రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి మండలం లో సామూహిక
దూడల నట్టల నివారణ కార్యక్రమం ప్రారంభం.





- తొలిరోజు 270 దూడలకు నట్టల నివారణ మందు.
- డాక్టర్ జి.నాగులు.

కామేపల్లి నవంబర్ 02 మీ వార్త ప్రతినిధి: కామేపల్లి మండల పరిధిలోని కామేపల్లి, రామకృష్ణాపురం పంచాయతీలలో సామూహిక దూడల నట్టల నివారణ కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ లు అజ్మీర బుల్లి హరి నాయక్, అజ్మీర ద్వాలి చిన్న నాయక్ ప్రారంభించారు. తొలి రోజు మొత్తం 270 దూడలకు నట్టల నివారణ మందులు తాగించడం జరిగిందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి.నాగులు తెలిపారు. పాడి రైతులు పాల్గొని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి. నాగులు సారధ్యంలో నట్ట ల నివారణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. దూడల్లో నట్టల నివారణ ద్వారా వాటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, ఎదుగుదల ఉత్పాదకత పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.మండలం లోని పాడి రైతులందరూ ఈ సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల ని కోరారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శిరీష, వంశీ, శరత్, ధర్మ,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వడ్లు ఆరబోస్తే కఠిన చర్యలు తప్పవు.

- ధాన్యం కుప్పను ఢీకొని వాహనదారుడి మృతి.. ఇద్దరిపై క్రిమినల్ కేసు నమోదు.

- రైతులు రహదారులను కల్లాలుగా మార్చొద్దు -

- సత్తుపల్లి ఎస్‌హెచ్‌ఓ తుమ్మలపల్లి శ్రీహరి హెచ్చరిక.

సత్తుపల్లి నవంబర్ 02 మీ వార్త ఆర్.సి:

రైతులు రహదారులపై ధాన్యం ఆరబోయడం వాహనదారుల పాలిట ప్రాణసంకటంగా మారుతోందని, ఇకపై ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సత్తుపల్లి పోలీసులు హెచ్చరించారు. రహదారులపై ధాన్యం ఆరబోయడం వల్ల ఇప్పటికే ఒక నిండు ప్రాణం బలికావడం తీవ్ర విషాదాన్ని కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే.. నవంబర్ 1వ తేదీన సదాశివునిపాలెం గ్రామంలో గ్రామానికి చెందిన గాయం రాము, చాట్ల లక్ష్మి అనే ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ రహదారిపై వరి ధాన్యం ఆరబోశారు. అదే మార్గంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న తుంబూరు గ్రామానికి చెందిన తురకా రాంబాబు రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను ఢీకొని అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు రోడ్డుపై ధాన్యం ఆరబోసి ప్రమాదానికి కారణమైన ఇద్దరు వ్యక్తులపై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తుమ్మలపల్లి శ్రీహరి వెల్లడించారు.



రైతులకు పోలీసుల కీలక హెచ్చరిక.

కొంతమంది రైతులు ప్రభుత్వ రహదారులపైనే ధాన్యం ఆరబోయడమే కాకుండా, వాహనాలు ధాన్యంపైకి రాకుండా రోడ్ల మధ్యలో పెద్ద పెద్ద రాళ్లు, ముళ్లకంచెలు, కట్టెలు ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జే.వి.ఆర్ ఓసి కి కేంద్ర బొగ్గు గనుల శాఖ ఫైవ్ స్టార్ గుర్తింపు.

సత్తుపల్లి నవంబర్ 02 మీ వార్త టౌన్ రిపోర్టర్:

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరంలో ఐదు బొగ్గు గనులకు జాతీయ స్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించి తన సత్తాను చాటుకుంది.సోమవారం ఛత్తీస్ ఘడ్ , రాయపూర్ లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో సింగరేణి సంస్థ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిన గనుల అవార్డులను భారత ప్రభుత్వ బొగ్గు మరియు గనుల శాఖ కేంద్ర సహాయ మంత్రివర్యులు సతీష్ చంద్ర దూబే చేతుల మీదుగా సింగరేణి చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి , ఈ ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. సింగరేణి సంస్థ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు, సత్తుపల్లి అధికారులు బెజ్జంకి రాజేశ్వరరావు లు పాల్గొన్నారు. ఈ విజయం పట్ల డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, గనుల యాజమాన్య బృందాలకు మరియు కార్మికులకు అభినందనలు తెలిపారు. సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ వెంకటాచారి ఆదేశాల మేరకు మేనేజర్ బెజ్జంకి రాజేశ్వరరావు జే.వి.ఆర్ ఓసి ఫైవ్ స్టార్ రేటింగ్ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ నిర్వహించే అత్యుత్తమ గనుల ఎంపికలో సింగరేణి సంస్థ నుండి సత్తుపల్లి ఏరియా జే.వి.ఆర్ ఓసి, శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే న్యూటెక్, ఆర్కే 6, బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసి, రామగుండం ఏరియా ఓసి 1 జాతీయ ఉత్తమ అవార్డులకు ఎంపిక అవడం జరిగింది. ఈ సంవత్సరం సింగరేణి ఐదు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం ప్రశంసనీయం. బొగ్గు మంత్రిత్వ శాఖ దేశంలోని అత్యుత్తమ పనితీరు కనబరిచే గనులకు స్టార్ రేటింగ్ లను ప్రధానం చేస్తుంది. బొగ్గు మంత్రిత్వ శాఖ గని పనితీరు, భద్రతా చర్యలు, నిర్వహణ పద్ధతులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పర్యావరణ అనుకూల చర్యలు, కార్మికుల సంక్షేమం వివిధ రకాల పనితీరుపై గుర్తించి జాతీయస్థాయిలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పిన గనులను ఎంపిక చేసి స్టార్ రేటింగ్స్ నిర్ణయిస్తుంది.



ఉత్పత్తి సాంకేతికతలలో కంపెనీ ఉన్నత పాటించడం వల్ల ఈ అవార్డులు లభించాయి. సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ వెంకటాచారి జే.వి.ఆర్ ఓసి మైన్ కు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించుటకు కృషిచేసిన అధికారులకు, ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు అభినందనలు తెలిపారు.

పోలీస్ హెడ్ క్వార్టర్స్, ఓఎస్డీ కార్యాలయల్లో పునరుద్ధరించిన నిర్మాణాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.





కొత్తగూడెం నవంబర్ 02 మన మీ వార్త: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హేమచంద్రపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్‌కు ముందుగా ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తదనంతరం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పునరుద్ధరించిన డాగ్ కెన్నెల్, బీడీ టీమ్ రూమ్, మెన్ బ్యారక్స్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అదేవిధంగా మోటార్ వాహనాల పార్కింగ్ కోసం నూతనంగా నిర్మించిన షెడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాగ్ స్క్వాడ్, బీడీ టీమ్ సిబ్బందితో మాట్లాడి వారి విధి నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. డాగ్‌ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వసతులు, బ్యారక్స్‌ను పరిశీలించి, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసిన అధికారులను, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఓఎస్డీ కార్యాలయంలో పునరుద్ధరించిన ఆపరేషన్ ఆర్ఐ కార్యాలయ గది, మెన్ బ్యారక్స్‌ను ప్రారంభించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఇ. శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్, రవి, నరసింహారావు, లాల్ బాబు, కృష్ణారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో జనజాతీయ గౌరవ దివస్ 2026 కార్యక్రమాల వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ.

- ఐటీడీఏ పీవో బి.రాహుల్.

భద్రాచలం నవంబర్ 2 మన మీ వార్త:





భారత స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల ఆరాధ్య దైవం, ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకొని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాలలో నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ దివస్ (జీజీ+ణ) -- 2026 పక్షోత్సవ కార్యక్రమాలు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జనజాతీయ గౌరవ దివస్‌కు సంబంధించిన బ్యానర్లు, కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ లోగో, ప్రచార సామగ్రిని ఐటీడీఏ యూనిట్ అధికారులు మరియు ఆదివాసి ప్రతినిధుల సమక్షంలో ఆయన ప్రదర్శించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్ జాతీయ గౌరవ దివస్ ప్రాముఖ్యతను తెలియజేసే ప్రచార కార్యక్రమాలను గిరిజన గ్రామాలలో విస్తృతంగా నిర్వహించాలని, నవంబర్ 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ పక్షోత్సవాల్లో భాగంగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, భాషలు మరియు వారసత్వ సంపదను ప్రజలకు తెలియజేసేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా భగవాన్ బిర్సా ముండా ఆశయాలు, గిరిజనుల ఆత్మగౌరవం, హక్కులు మరియు అభివృద్ధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ డి సి ఆనంద్ కుమార్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన, ఆర్సిఓ గురుకులం అరుణకుమారి, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, పి వి టి జి అధికారి గన్యా, ఎల్ టి ఆర్ డి టి మణిధర్, ఎడిఎంహెచ్ఓ సైదులు, ఏవో సున్నం రాంబాబు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, ఇతర శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సమస్యలు పరిష్కరించండి.

- డివిజన్ అధికారులను ఆదేశించిన భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ.



భద్రాచలం ఫిబ్రవరి 2 మన మీ వార్త: డివిజన్ ప్రజలు వివిధ సమస్యల గురించి ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న అందరికి సంబంధిత అధికారులు వారి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు వారికి సంబంధించిన వివిధ సమస్యల గురించి నేరుగా ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకుంటే సమస్యలు పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి అవకాశం ఉంటుందని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో ప్రజావాణిలో సమర్పించడానికి వచ్చిన ప్రజల నుండి వివిధ అధికారుల సమక్షంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ దరఖాస్తుదారులు కోరిన విధంగా అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా చర్యలతో పాటు రెవెన్యూ కు సంబంధించిన సమస్యలు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు నిరుద్యోగులకు సంబంధించిన వినతి పత్రాలను అలాగే వివిధ సంక్షేమ పథకాల కోసం ప్రజలు అందించిన విన్నపాలను సాధ్యమైనంత తొందరగా పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇందులో ముఖ్యంగా రెవిన్యూ సమస్యలు, పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలతో నిరుద్యోగులు వారికి సంబంధించిన సమస్యల గురించి పరిష్కరించాలని అలాగే పలు రకాల సమస్యలపై ప్రజలు అర్జీలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి ఆన్లైన్ చేసి సంబంధిత డివిజన్ అధికారులకు పంపుతూ, ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాకాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేసి, నిర్ణీత గడువులో పరిష్కారం జరిగేలా చర్యలు చేపట్టాలని, పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఏ ఓ భగవాన్ రెడ్డి, నయబ్ తహసిల్దార్ వినయ్ శీల శ్రీరామ్ మరియు డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ ట్రైనింగ్ స్కూల్లో గిరిజన మహిళల నుండి దరఖాస్తుల స్వీకరణ.

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్.



2026- 28 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటీడీఏ ప్రభుత్వ గిరిజన MPHW (F) ట్రైనింగ్ స్కూల్లో (02 సంవత్సరాలు) మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) / ఆహీవీ ట్రైనింగ్ కోర్సుకు మొదటి సంవత్సరంలో ప్రవేశం కల్పించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ అర్హత కలిగి ఉండాలని,(ALL GROUPS) వయస్సు కనీసం 17 సంవత్సరాలు ఉండాలని ఆయన అన్నారు. దరఖాస్తు విధానం: అర్హత గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు ఫారం మరియు వివరాల కోసం http://chfw.telangana.gov.in వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకొని ఈనెల 22-10-2026 నుండి 10-11-2026 వరకు అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకోవచ్చని ఆయన అన్నారు. దరఖాస్తు రుసుము రూ:-200/- (డిమాండ్ డ్రాఫ్ట్) Commissioner of Health & Family Welfare, Telangana, Hyderabad పేరున తీసుకోవాలని ఆయన అన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు జతచేయవలసిన పత్రాలు:

ఎస్ ఎస్ సి సర్టిఫికేట్, ఇంటర్మీడియట్ సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం (ఎస్టి), నివాస ధృవీకరణ పత్రం / 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్లు. ఆదాయ ధృవీకరణ పత్రం, అవివాహిత ధృవీకరణ పత్రం, డిడి ఒరిజినల్ కాపీ, ఫిజికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్. పూర్తిచేసిన దరఖాస్తులను ప్రిన్సిపాల్ గిరిజన mphw (మహిళ) ANM ట్రైనింగ్ స్కూల్. భద్రాచలం కార్యాలయంలో 10.11.2026 సాయంత్రం 5 గంటల సమయంలోపు సమర్పించాలని ఆయన కోరుతూ మరిన్ని వివరాల కొరకు ఫోన్ నెంబర్ 9490370905,9963315323,9000983664 సంప్రదించి తెలుసుకోవాలని ఆయన కోరారు.

ఐటీడీఏ పీవో హామీతో 22 రోజుల రిలే నిరాహార దీక్షలు విరమణ సొందే వీరయ్య.





భద్రాచలం నవంబర్ 02 మన మీ వార్త: భద్రాచలం ఐటీడీఏ ధర్నా చౌక్ లో గత నెల 12వ తేదీన ప్రారంభించిన రిలే నిరాహార దీక్షలు ఈరోజు అనగా సోమవారం నాటికి 22 రోజులు కొనసాగినాయని ఐటీడీఏ పిఓ హామీతో ఏ పీ ఓ డేవిడ్ రాజు దీక్షా శిబిరానికి వచ్చి నిమ్మరసం ఇచ్చి విరమింప చేసినారు. సంఘ సభ్యులు మెమోరాండం ఇవ్వడం జరిగింది... సర్వేనెంబర్ 83 లో 7.90.సెంట్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైన భూమిపై సంబంధిత తాసిల్దార్ కి ఫార్వర్డ్ చేసి మాట్లాడామని త్వరలోనే వారికి నోటీసులు జారీ చేస్తామని ఐటీడీఏ పీవో హామీ ఇచ్చారు. అలాగే చర్ల మండలం కుదునూరు. దేవరపల్లి పోడు భూమి సమస్యను తొందరగానే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని మెమోరాండం ఇవ్వగా ప్రభుత్వానికి సిఫార్స్ చేస్తానని హామీ ఇచ్చారు. ఆదివాసి ప్రజా ప్రతినిధులతో, ఆదివాసి సంఘాల నాయకులతో ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేస్తానని అందులో కీలకమైన ఆదివాసీల సమస్యలను పరిష్కారానికి అభిప్రాయాలు తెలుసుకోవడం వీలుంటుందని హామీ ఇచ్చారు. సోమవారం విరమణ లో పాల్గొన్న నాయకులు రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, ఏ ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి, పూనెం నాగేశ్వరావు, కుంజ లక్ష్మయ్య, కుంజా వీరస్వామి, సున్నం సుబ్బయ్య, పాయం సన్యాసి, కారం సాయమ్మ, కారం సుధ, పోడియం రామ్ అక్క, తెల్లం తిరుపతమ్మ, కుంజా ఈశ్వరమ్మ, పాయం కాంతమ్మ, కారం జగ్గమ్మ, కుంజ అమల కుమారి, పర్షిక పార్వతమ్మ, తుర్రం తులసమ్మ, తాటి విజయ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

దిగివచ్చిన ముడిచమురు ధరలు.. ఏకంగా వెయ్యికిపైగా పాయింట్ల లాభంతో సెన్సెక్స్..!



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధాన్ని ముగించేందుకు చర్చలు జరుగుతున్నాయన్న వార్తలతో ముడిచమురు ధరలు దిగివచ్చాయి. దాంతో సూచీలు భారీ లాభాల్లో దూసుకుపోతున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 1000 పాయింట్లకుపైగా ఎగబాకింది. ఉదయం 11.10 గంటల సమయంలో సెన్సెక్స్ 989 పాయింట్ల లాభంతో 75,488 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 289 పాయింట్లు పెరిగి 23,305 వద్ద కదలాడుతున్నది. నిఫ్టీ సూచీలో రిలయన్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, టాటా స్టీల్, జియో ఫైనాన్షియల్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ఉండగా సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్, ఐషర్ మోటార్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ షేర్లు నష్టపోతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.97 వద్ద ప్రారంభమైంది. త్రైమాసిక ఫలితాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.29,550 కోట్ల రికార్డు నికర లాభాన్ని నమోదుచేసింది. ఈ ఫలితాలు మదుపర్లను మెప్పించాయి. దాంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 6 శాతానికిపైగా ఎగబాకింది. కంపెనీల బలమైన ఫలితాలు ప్రధాన సూచీల ర్యాలీకి కారణమయ్యాయి. మరోవైపు బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు 110 డాలర్లకు దిగివచ్చింది. గతవారం ఆరునెలల గరిష్ఠస్థాయి అయిన 118 డాలర్లను తాకింది. ఇప్పుడు 8 డాలర్‌లు వెనక్కి తగ్గింది.

గ్రోక్ ఏఐ ఖర్చులు భరించలేకపోతున్నా: మస్క్



ఉత్పాదకతను పెంచుకునే లక్ష్యంతో పలు కంపెనీలు ఏఐ వినియోగం వైపు మొగ్గుచూపుతున్నాయి. అయితే.. ఏఐ కారణంగా ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో.. వాటిని తగ్గించుకోవడానికి కొత్త మార్గాల ను అన్వేషిస్తున్నాయి. తాజాగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సైతం దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'ఎక్స్' సామాజిక మాధ్యమంలోని 'గ్రోక్' ఏఐ చాట్‌బాట్‌ను నిర్వహించడానికి తన కంపెనీకి భారీ మొత్తంలో డబ్బు ఖర్చవుతోందని పేర్కొన్నారు. వచ్చే ఆదాయంతో పోలిస్తే.. ఖర్చులే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎక్స్ (శ) లోని పలువురు ప్రీమియం వినియోగదారులు.. తమ వారపు గ్రోక్ బాట్ వినియోగ కోటాలు వేగంగా అయిపోతున్నాయని కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఓ మాజీ యూజర్ స్పందిస్తూ.. గ్రోక్ బాట్ వినియోగ పరిమితులను రీసెట్ చేయాలని కోరుతూ మస్క్‌ను ట్యాగ్ చేశారు. దీనిపై స్పందిస్తూ మస్క్ పై వ్యాఖ్యలు చేశారు. సర్వర్ ఖర్చులు మరింత పెరగకుండా నిరోధించడానికి, కంపెనీ కఠినమైన వినియోగ పరిమితులను అమలు చేస్తోందని వెల్లడించారు. ఏఐపై అమెరికాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ కంపెనీలు చేసిన మొత్తం అప్పు రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ కంపెనీల మొత్తం అప్పు 2026 మధ్య నాటికి దాదాపు 45 శాతం పెరిగి 578 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.54లక్షల కోట్లు)కు చేరుకున్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో ఆల్ఫాబెట్, అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, టెస్లా ఉన్నాయి.

గిరిజన దర్బార్ విన్నపాలను సత్వర పరిష్కారం చూపాలి.

- ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి.
- గిరిజనుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం మరియు జాప్యానికి తావివ్వొద్దు.
- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్..

భద్రాచలం నవంబర్ 02 మన మీ వార్త:



వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి స్వీకరించే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత యూనిట్ అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత యూనిట్ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ డి సి ఆనంద్ కుమార్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన, ఆర్సిఓ గురుకులం అరుణకుమారి, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఎడిఎంహెచ్ఓ సైదులుతో కలిసి గిరిజనుల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, ఇందిరమ్మ గృహాలు, మౌలిక వసతులు, తదితర సమస్యలను గిరిజనులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గిరిజన దర్బార్ అనుకూలమైన వేదికగా నిలిచిందని, గిరిజనుల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని ఆయన అన్నారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఐటీడీఏ యూనిట్ అధికారుల శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ గిరిజన దర్బార్ లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని యూనిట్ అధికారులను ఆదేశించారు. గిరిజన దర్బార్ లో గిరిజనులు దరఖాస్తులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

గిరిజన దర్బార్ లో గిరిజనులు సమర్పించిన అర్జీలు

పోడు భూములలో పట్టాల కొరకు, పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు తమ పొలాలలో నీటి సౌకర్యం కల్పించుట కొరకు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, నూతన చేపల సొసైటీల ఏర్పాటు కొరకు, వ్యవసాయ రంగానికి సంబంధించి కరెంటు, బోరు, మోటారు రుణం ఇప్పించుట కొరకు, గిరిజన గ్రామాలలో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించుట కొరకు, దీర్ఘకాలిక వ్యాధులకు ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, సౌర విద్యుత్ ద్వారా పంట పొలాల్లో కరెంటు కనెక్షన్ ఇప్పించుట కొరకు మరియు ఇతర ఆర్థిక ప్రయోజనాల కొరకు గిరిజనులు అర్జీలు సమర్పించారని ఆయన అన్నారు. గిరిజన దర్బార్ లో వచ్చిన అర్జీలు అన్ని ఆన్లైన్లో పొందుపరిచి అర్హులైన ప్రతి ఒక్కరికి విడతలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పి వి టి జి అధికారి గన్యా, హార్టికల్చర్ అధికారి ఉదయ్ కుమార్, ఎల్ టి ఆర్ డి టి మనిధర్, ఏవో సున్నం రాంబాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, హౌసింగ్ ఏఈ హేమంత్, జేడీఎం హరికృష్ణ, హెచ్ఈవో కృష్ణయ్య, మేనేజర్ ఆదినారాయణ వివిధ శాఖల సిబ్బంది హరిత, విజయ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో అమ్మకాల 'పండుగ'.. అక్టోబర్‌లో 5 లక్షలు!



పండుగ సీజన్ కలిసి రావడంతో అక్టోబర్‌లో దేశీయ ప్యాసింజర్ వాహనాల హోల్‌సేల్ విక్రయాలు రికార్డు స్థాయిలో 5 లక్షల యూనిట్ల మార్కును దాటాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి దిగ్గజ వాహన సంస్థలు తమ చరిత్రలోనే అత్యధిక నెలవారీ విక్రయాలను నమోదు చేశాయి. ఈ ఏడాది (2026) అక్టోబర్‌లో 5.25 లక్షల నుంచి 5.30 లక్షల మధ్య ప్యాసింజర్ వాహనాలు అమ్ముడై ఉండవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతేడాది ఇదే అక్టోబర్‌లో నమోదైన 4.60 లక్షల యూనిట్లతో పోలిస్తే, ఈసారి వార్షిక ప్రాతిపదికన విక్రయాల వృద్ధి 13 నుంచి 15 శాతంగా ఉంటుందని భావిస్తున్నారు. మొబిలిటీ గ్లోబల్ లైట్ వెహికల్ ప్రొడక్షన్ ఫోర్‌కాస్టింగ్ అసోసియేట్ డైరెక్టర్ గౌరవ్ వంగాళ్ మాట్లాడుతూ.. "నవంబర్ మొదటి వారంలోనే ధనత్రయోదశి, దీపావళి పండుగలు ఉండటంతో.. డిమాండ్‌కు తగ్గట్టుగా వాహనాలను అందించేందుకు ఆటో కంపెనీలు అక్టోబర్‌లోనే డీలర్లకు భారీగా స్టాక్‌ను పంపాయి. దీంతో అక్టోబర్ హోల్‌సేల్స్ గణనీయంగా పెరిగాయి. అయితే, కస్టమర్లు వాహనాలను డెలివరీ తీసుకునే ప్రక్రియ ప్రధానంగా నవంబర్‌లోనే జరగనుంది. గతేడాది పండుగ సీజన్‌తో పోలిస్తే అక్టోబర్ వాహన రిజిస్ట్రేషన్లు (రిటైల్స్) కొంత తగ్గే అవకాశమున్నప్పటికీ, నవంబర్‌లో ఇవి మరింత పుంజుకుంటాయి" అని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో దేశీయ ప్యాసింజర్ వాహనాల విక్రయాలు గత ఏడాదితో పోలిస్తే 28.3 శాతం పెరిగి 20.55 లక్షల యూనిట్లకు చేరాయి.

దిగ్గజ జట్లకు షాక్.. వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన ఆఫ్ఘనిస్థాన్

తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు

శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లను వెనక్కి నెట్టిన వైనం

వన్డే, టీ20 ప్రపంచకప్‌లలో అద్భుత ప్రదర్శనలతో సత్తా చాటిన ఆఫ్ఘన్

ఇటీవల ఐర్లాండ్, జింబాబ్వే సిరీస్‌లలో క్లీన్‌స్వీప్‌లతో జోరు



అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు చేసింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన టోర్నమెంట్లలో ఆఫ్ఘన్ ప్రదర్శన ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది. అలాగే, ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరి తమ సత్తా చాటింది. ఇటీవల కాలంలో సాధించిన వరుస విజయాలు ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ స్థానాన్ని మరింత మెరుగుపరిచాయి. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన ట్రై-సిరీస్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా అజేయంగా నిలిచింది. వన్డేలతో పాటు టీ20 ఫార్మాట్‌లోనూ ఆఫ్ఘన్ జోరు కొనసాగుతోంది. తాజాగా షార్జాలో జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో జింబాబ్వేను కేవలం 79 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ఈ సిరీస్‌లోని రెండో టీ20లో అజ్మతుల్లా ఒమర్జాయ్ కేవలం 50 బంతుల్లో 116 పరుగులు చేయగా, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ఈ వరుస విజయాలు, నిలకడైన ప్రదర్శనతో ఆఫ్ఘనిస్థాన్ ప్రపంచ క్రికెట్‌లో ఒక బలమైన జట్టుగా ఎదుగుతోంది.

న్యూజిలాండ్ వీధుల్లో సామాన్యుల్లా భారత క్రికెటర్లు..



భారత క్రికెట్ స్టార్లకు స్వదేశంలో ఉండే ఆదరణ, అభిమానం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వారు బయటకు వస్తే చాలు, అభిమానులు చుట్టుముడతారు. అయితే, విదేశీ పర్యటనల్లో మాత్రం వారికి పూర్తి భిన్నమైన అనుభవం ఎదురవుతుంది. తాజాగా టీమిండియా ఆటగాళ్లు రోహిత్ శర్మ, కుల్దీప్ యాదవ్ విషయంలో ఇదే జరిగింది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు రోహిత్ శర్మ, కుల్దీప్ ఆక్లాండ్ వీధుల్లో సరదాగా షికారు చేస్తూ కనిపించారు. సాధారణ దుస్తుల్లో సెక్యూరిటీ సిబ్బందితో కలిసి మాట్లాడుకుంటూ నడుస్తున్న వీరిని స్థానికులు ఎవరూ గుర్తుపట్టినట్లు కనిపించలేదు. ఎలాంటి హడావుడి లేకుండా, పూర్తి స్వేచ్ఛగా వారు తమ సమయాన్ని ఆస్వాదించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన అభిమానులు.. విదేశాల్లో భారత క్రికెటర్లకు లభించే ప్రశాంతత, వ్యక్తిగత స్వేచ్ఛపై చర్చించుకుంటున్నారు. కాగా, ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం రోహిత్ శర్మ గత వారమే న్యూజిలాండ్ చేరుకున్నాడు. ఇక కుల్దీప్ యాదవ్ ఇప్పటికే అక్కడ ముగిసిన టీ20 సిరీస్‌లో జట్టులో ఉన్నప్పటికీ, ఆడే అవకాశం రాలేదు. కనీసం వన్డే సిరీస్‌లోనైనా తుది జట్టులో చోటు దక్కించుకోవాలని ఆశిస్తున్నాడు.

స్పోర్ట్స్

రోహిత్ వర్సెస్ కోహ్లీ: ఎవరు సెంచరీ చేస్తారు? పుజారా అంచనా ఇదే..!

- కోహ్లీకి సెంచరీ అవకాశాలు ఎక్కువన్న పుజారా
- మూడో స్థానంలో బ్యాటింగ్ కోహ్లీకి కలిసొస్తుందని వ్యాఖ్య
- న్యూజిలాండ్‌లో రోహిత్ పాత్ర మారొచ్చని అంచనా
- ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని జోస్యం
- న్యూజిలాండ్‌కు స్వల్ప ఆధిక్యం ఉంటుందని అభిప్రాయం



న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ కంటే విరాట్ కోహ్లీకి సెంచరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో కోహ్లీ మూడో స్థానంలో రావడం అతడికి ఇన్నింగ్స్‌ను నిర్మించుకునే అవకాశం కల్పిస్తుందని చెప్పాడు. అదే సమయంలో ఓపెనర్‌గా రోహిత్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడాల్సి ఉంటుందని, న్యూజిలాండ్ పిచ్‌లపై అతడి పాత్రలో మార్పు ఉండొచ్చని పేర్కొన్నాడు. జియోస్టార్‌తో మాట్లాడిన పుజారా.. "రోహిత్ సాధారణంగా పవర్‌ప్లేలో జట్టుకు మంచి ఆరంభం అందించడంపై దృష్టి పెడతాడు. న్యూజిలాండ్ పరిస్థితుల్లో అతడి పాత్ర మారవచ్చు. అయితే కోహ్లీ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. ఇన్నింగ్స్‌ను నిలబెట్టి ఆడటం అతడి ఆటతీరులో కీలకం. ఈ స్థానంలో వచ్చే బ్యాటర్‌కు వన్డేల్లో సెంచరీ చేసే అవకాశం కొంత ఎక్కువగా ఉంటుంది. అందుకే రోహిత్ కంటే కోహ్లీకి శతకం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నా" అని వివరించాడు. ఈ సిరీస్ హోరాహోరీగా సాగుతుందని పుజారా అంచనా వేశాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని, వర్షం కారణంగా ఓ మ్యాచ్ రద్దయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాడు. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఆడే భారత జట్టు, చివరి రెండు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగే జట్టు వేరుగా ఉండనుండటం న్యూజిలాండ్‌కు కొంత అనుకూలిస్తుందని అభిప్రాయపడ్డాడు. అయితే తొలి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టు మెరుగ్గా రాణిస్తుందని పుజారా విశ్వాసం వ్యక్తం చేశాడు. చివరి రెండు మ్యాచ్‌లు టీమిండియాకు కొంత సవాలుగా మారవచ్చని అన్నాడు. న్యూజిలాండ్‌లో వర్షాలు కూడా మ్యాచ్‌ల ఫలితాలపై ప్రభావం చూపవచ్చని పేర్కొన్నాడు.